# అమృతం

అసలు ఏమిటీ జీవితం? శారీరక సుఖమా... ఎప్పుడు శరీరం సహకరించటం మానేస్తుందో తెలియదు.

మానసిక ఆనందమా?... ఎప్పుడు మనసు వికలమవుతుందో తెలియదు.

ఓ కట్టుబాటులో జీవితాన్ని ఇరికించెయ్యటమా? లేక, విచ్చలవిడిగా, స్వేచ్ఛగా గడపటమా?

ఏది మంచి? ఏది చెడు?

వర్మ గుర్తొస్తున్నప్పుడల్లా చెలరేగి ఇరుకున పడేసి, ఇబ్బంది పెడుతున్న ఆలోచనలు.

పూర్తిగా ఏమీ తెలియని అమాయకత్వమూ కాదు. అలా అని ఇదే... ఇది ఇంతే, అన్న నిర్ణయస్థితీ కాదు. ఉక్కిరి బిక్కిరిగా ఉంటోంది రామ్మూర్తికి. ఊపిరి అందీ అందనట్టు ఆందోళన.

ఇంటా, బయటా ఎక్కువగా రామ్మూర్తిగారుగా చెలామణీ అయ్యే రామ్మూర్తికి, ఇల్లూ, వాకిలీ, సంపాదనా, సంతానం, చక్కటి

అభిరుచి, హాయైన పరిచయాలు... ఇలా ఉండాల్సినవన్నీ ఉన్నాయి. అటో, ఇటో తేల్చి చెప్పమంటే, జీవితం బాగానే ఉంది అన్న అభిప్రాయమూ ఉంది.

కానీ ఈమధ్యే ఆందోళన... ప్రాణమిత్రుడు, చిరకాల సన్నిహితుడు వర్మ కొద్దిరోజుల క్రితమే చచ్చిపోయాడు.

తనిలా ఉండటానికి స్నేహితుడి మరణమే కారణం! 'ప్రసూతి, స్మశాన, వైరాగ్యాలు ఇలాగే ఉంటాయి!' అని సరిపెట్టుకోవాలని చాలా ప్రయత్నం చేస్తూనే ఉన్నా, సాధ్యపడటంలేదు.

కాస్సేపు ధైర్యంగా ఉంటోంది. మళ్లీ అకస్మాత్తుగా దిగులు. దిగులుగా ఉన్నప్పుడల్లా సమాధానం దొరకని ప్రశ్నలు రామ్మూర్తి ఆలోచనని ఇబ్బంది పెడుతున్నాయి.

అరవై ఏళ్ల వయసులో రామ్మూర్తికి మరణవార్తలు వినటం, అందులో దగ్గరివాళ్ల మరణవార్తలు వినటం తొలి అనుభవమేం కాదు. కాలం చాలా మరణాలని సమాధానపరుస్తుంది, అదీ తెలుసు. రోజులు గడుస్తున్నా తనని వదలని ఆలోచనల బాధకి చాలావరకూ విలక్షణమైన వర్మ జీవితం అతి దగ్గరగా తెలియటం కారణమనీ తెలుసు.

వర్మ తనకన్నా ఏడేళ్లు చిన్నవాడనీ, తామిద్దరికి అంతే దగ్గరైన రావుకి తనకన్నా అయిదేళ్ల వయసు ఎక్కువనీ అసంకల్పంగా చాలాసార్లు గుర్తొస్తోంది.

చావు వార్తలకి, వయసుల పోలికలకి సంబంధం ఉందా? ఏమో!

"ఒకరి చావే కాదు... అనేక మరణాలు కూడా జీవితాన్ని ఆపలేవు. దగ్గరివాళ్లు పోతే తాత్కాలికంగా అన్నింటిమీదా ఇచ్ఛ చచ్చిపోయినట్లు ఉంటుంది. కానీ సంతోషం మీదేనా... విషాదం మీదేనా సరే... ఇచ్ఛే జీవితం!..." వర్మ మాటలు.

మనిషిపోయినా మాటలు మిగిలిపోతాయంటారు. ఇదే కాదు, వర్మకి సంబంధించిన చాలా సంగతులు ముక్కలు ముక్కల్లా గుర్తొస్తున్నాయి. గుర్తొచ్చిన ఒక్కొక్క విషయం ఒకో జీవితభాగాన్ని, మరికొన్ని సంఘటనలు వర్మ తత్వాన్ని గుర్తు తెస్తున్నాయి.

వర్మపోయిన వార్తని అమెరికాలో ఉన్న రావుకి తెలియచేస్తే... "మనసుని చాలా కష్టపెట్టే వార్త తెలిపావురా!" అన్నది రావు బదులు.

తనలాగే రావూ గతాన్ని తలుచుకుని బాధపడుతున్నాడా? ఏమో!

ముగ్గురూ కలిసి బతికారు. ఆ బతికిన జీవితంలో ఇప్పటికీ సజీవమైనవి చాలా ఉన్నాయి.

అభిప్రాయాల్లో, చేతల్లో తనూ, రావూ పూర్తిగా ఒక్కటి కాకపోయినా, చాలావరకు దగ్గర. పూర్తి భిన్నంగా ఉన్నది వర్మే. అయినా దగ్గరతనంలో ఏ భేదం లేదు.

నలభై ఏళ్లయింది చదువుకోసం రావు అమెరికా వెళ్లి. ఆ తర్వాత అక్కడే స్థిరపడిపోయాడు. పెళ్లి ఇక్కడికొచ్చి ఇక్కడి అమ్మాయినే చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలూ అక్కడే పుట్టారు. అక్కడే పెరిగారు.

పెళ్లి చేసుకోకూడదన్నది వర్మ నిర్ణయం. అలాగే పెళ్లి చేసుకోకుండానే ఆ బతుకు తెల్లారిపోయింది.

"నా సుఖం, నా బాధ నాకే అర్థం కావటంలేదు. అందులోకి ఇంకో ఆడదాన్ని లాగి బాధపెట్టడం అన్యాయం. నాకు ఏ రకం పద్ధతీ నచ్చటంలేదు. అలాంటప్పుడు తెలిసి తెలిసీ ఇంకోళ్లకెందుకు నా చెర... పూర్తి బేవార్స్‌గా ఉండటం నయం!"

చదువు, ఉద్యోగం... ఎందులోనూ లోటు లేదు. డబ్బు విషయంగా ఎప్పుడూ ఎవరి మీదా ఆధారపడలేదు. తనిష్టం వచ్చినట్టు బతికాడు వర్మ. ఎటొచ్చీ పెళ్లి చేసుకోలేదు. అసలే దగ్గర వాళ్లెవరూ లేని వర్మ జీవితం ఒంటరిగానే గడిచిపోయింది.

తాగాలంటే తాగటం, తిరగాలంటే తిరగటం. ఎప్పుడు ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్లిపోవటం... స్వేచ్ఛ తన జీవితంగా గడిపాడు వర్మ. అలా అని అద్భుతంగా సుఖపడ్డాడా అంటే, అదీ అనేమానమే... ఒక్కోరోజు "నాకేమిటిరా?" అనేవాడు.

కానీ వర్మ ఎవరికేం చెప్పినా, ఎవరితో ఎలా ఉన్నా, ఎప్పుడూ ఎవరికీ బాధ కలిగించలేదు. మనిషి పెద్ద అందగాడు కాదు. అలా అని ఆకర్షణ లేకపోవటం లేదు. ఎందరో, ఎందరెందరో స్త్రీలు... రకరకాలవాళ్లు... సంసారమంత సహజంగా ఏ గిల్టీ ఫీలింగ్ లేకుండా వాళ్లతో ఉండేవాడు.

"ఇష్టం ముఖ్యంరా...! సంప్రదాయం, లీగాలిటీ కాదు. ఆడా, మగా దగ్గరయ్యే క్షణాలు వెలుగుతాయి. ఆ వెలుగు లేకపోతే ఏమీ లేదు. మనం సుఖపడటం తేలికే! ఎదుటివాళ్లు కష్టపడకుండా చూడగలగటం కష్టం. ఎవరి కష్టానికైనా ఓదార్పుగా ఉండగలిగి, మనం చెయ్యగలిగింది చెయ్యడంలో ఎంత సుఖం! కానీ, చాలా రకాల బద్ధకాలు, స్వార్థాలు, సుఖలాలసలు అడ్డొస్తాయి!"

వర్మ పద్ధతిలో తప్పుపట్టటానిఏమీ కనిపించలేదు రామ్మూర్తికి, కానీ మనస్ఫూర్తిగా సమర్థించనూ లేదు.

వర్మ స్వేచ్ఛ ఎవరికీ చెడుపు చెయ్యలేదు... చేస్తే వర్మకే చేసింది. జీవితమంతా పాజిటివ్ పద్ధతిలోనే గడిచింది.

చనిపోయేముందు మాత్రం చెప్పింది చాలా బలంగా చెప్పాడు వర్మ రామ్మూర్తితో...

"చాలామందికన్నా చాలా స్వేచ్ఛగా బతికాను, సుఖపడ్డాను. దుఃఖపడ్డాను. కానీ చేసిన పొరపాటు, ఏనాడూ ఆరోగ్యానికి విలువనివ్వకపోవటం. చావు ఇబ్బంది కాదురా...

కానీ అనారోగ్యం భయంకరం... మనసులో మనం పోగేసుకున్న విలువలన్నింటిమీదా.. అనుమానాలు రేపే తీవ్ర శారీరక బాధ... ఆ స్థితి... ఇహలోక నరకం... అందుకే మనవాళ్లందరూ చెప్పిన చాలా గొప్పమాటలు... అరిగిపోయి అరిగిపోయి... నవనీతిలో మనం పట్టించుకోని మాటలు "ఆరోగ్యమే మహాభాగ్యం" అన్నది మాత్రం అక్షరసత్యం!

వర్మకి మరణం తేలిగ్గా రాలేదు. అనేక రకాల హింస పడి, పడీ పోయాడు.

దగ్గరగా ఉన్నాడు కాబట్టి ఆ బాధ రామ్మూర్తి చాలావరకూ చూశాడు. దూరంగా ఉండటంవల్ల రావు చూళ్లేదు.

తను చూసినదంతా తనలో మెలికలు తిరుగుతున్నదంతా బరువు తగ్గేలా ఎవరికైనా చెప్పాలనుకుంది రామ్మూర్తికి. ఎవరికి? ఎవరికి... రావుకే చెప్పాలి.

xxx

అసలు అనుకోని విషయం... ఆశ్చర్యం! ఎదురుగా రావు నడిచి వస్తున్నాడు.

"ఏమిటిరా... నువ్వే...!" అంటూ కూర్చున్న చోటునుంచి లేవబోయాడు రామ్మూర్తి.

"నేనే! ఏమీ కంగారు లేదు. ముందు కూర్చో. చూడాలనిపించింది వచ్చేశాను, అంతే!" అన్నాడు రావు ఎదురుగా కూర్చుంటూ.

"సామాను?"

"అబ్బాయి కూడా వచ్చాడు. హోటల్‌లో ఉంటానన్నాడు. వాణ్ణి హోటల్ దగ్గర డ్రాప్‌చేసి... లోపలికి కూడా వెళ్లకుండా వచ్చేరా.. వాడే ఫోన్ చేస్తాడు".

ఆ తర్వాత ఇద్దరిమధ్యా మాటలు సాగని కొన్ని క్షణాలు ఎంతో ఓదార్పుగా గడిచాయి.

ఆ క్షణాల తర్వాత ఎన్నో మాటలు ఎంతో ఆప్యాయత... అయిదారు గంటలు గడిచినా గడిచినట్టే తెలియని సమయం.

ఎవరు ముందు ప్రస్తావించాలి అనుకుంటూనే వర్మ సంగతి వచ్చింది.

"వాడు పోయాడని తెలియగానే నిన్ను చూడాలనిపించిందిరా... ఆ దిగులు నీతో పంచుకోకపోతే బరువు తగ్గదనిపించింది!" అన్నాడు రావు.

ఆ ఒక్క మాటతో వర్మ చావుని, అమెరికా హడావుడిలో రావు పట్టించుకోలేదన్న సందేహం తీరిపోయింది రామ్మూర్తికి.

ఆ తర్వాత వర్మ సంగతి చాలాసార్లు వచ్చింది.

"పోనీలేరా, వాడనుకున్నట్టు బతికాడు... ఎవరినీ బాధించకుండా వెళ్లిపోయాడు!" అన్నాడు రావు.

"ఎవరినీ బాధపెట్టలేదు... కానీ వాడు మాత్రం నానా బాధా పడ్డాడు. చివర్లో... హాస్పటల్లో వాణ్ణి చూడటం చాలా కష్టమైంది. లివర్ పాడైపోయింది . కిడ్నీలు... ఒకటేమిటి... అంతటి అనారోగ్యం ఎలా భరించాడో... ఎలా దాచాడో... చివరి రోజుల్లో గానీ నాక్కూడా తెలపలేదు."

"వాడి పద్ధతి మొదటినుంచీ అంతే కదరా! అన్నీ జరిగాక తను అనుకున్నది చేసేశాక ఆ అనుభవం గురించి చెప్పేవాడు. జీవితం సుఖంగా ఉండాలనే కదా నేను పరాయి దేశం వెళ్లి నానా బాధలూ పడి స్థిరపడింది. ఎంతో కొంత సర్దుబాటు లేకపోతే జీవితం సుఖంగా ఉండనివ్వదురా... చాలావరకూ నేనూ నా ఇష్టప్రకారమే జీవించాను, సుఖించాను. కానీ వాడికీ మనకీ తేడా ఉంది. తనకు ఎవరూ లేరన్న చిన్ననాటి బాధో, ఏ బంధంమీదా నమ్మకం లేకపోవటమో... ఏమైనా అయిపోయింది వాడి జీవితం... అనారోగ్యంతో అంత బాధపడ్డాడన్నదే దిగులు. చివరి రోజుల్లోనైనా చూడలేకపోయాను. దగ్గరగా ఉండటం వల్ల నువ్వైనా చూడగలిగావు!"

రోజులు గడచినకొద్దీ స్నేహితులిద్దరూ సేదతీరుతున్నారు. కొడుకు హోటల్‌లో ఉన్నా, రావుగారు మూర్తి దగ్గరే ఉండిపోయారు. ఒకే ఊళ్లో ఉన్నా తండ్రి ఒకచోట... ఒంటరిగా హోటల్‌లో కొడుకు... కొత్త జీవితపు కొత్త పద్ధతులు!

×××

రావు చెప్పింది చాలా స్పష్టంగా అర్థమైంది. అయినా వెంటనే ఏం చెప్పాలో తోచలేదు రామ్మూర్తికి.

రావు చెప్పినవి కొద్ది మాటలే అయినా, అందులో చాలా విషయాలున్నాయి.

రావు కొడుకు రమేష్‌కి, రామ్మూర్తి కూతురు రాధాకుమారితో వివాహం అన్నది విషయం. కానీ అంతర్లీనంగా చిన్ననాటిస్నేహం, చాలా రోజులు రావు సొంతగడ్డకి దూరంగా ఉన్నా, అంతరించని మమకారం... అబ్బాయికీ, అమ్మాయికీ పరస్పరం ఇష్టమే అన్న ఉద్దేశం.

అభ్యంతరం చెప్పటానికి చెప్పగల కారణమేమీ లేదు రామ్మూర్తికి. వెంటనే సమాధానం మాత్రం చెప్పలేకపోయాడు. కంగారుపడకుండా ఆలోచించి చెప్పమని రావు సమయం ఇచ్చాడు.

రామ్మూర్తికి ఒక్కతే కూతురు. రాధని చిన్నతనం నుంచీ తనలో ఓ భాగంగా పెంచుకున్నాడు. అలాంటిపిల్ల అమెరికా వెళ్లిపోతే ఉండగలనా అన్నది ఓ బాధ. దూరం అన్నది మరో బాధ. సంప్రదాయం, పద్ధతుల్లో చాలా తేడాలున్నాయి. రాధకి జీవితం అక్కడ అనువుగా ఉంటుందా? అన్నది పెద్ద సందేహం.

ఢిల్లీ వెళ్లి వారం రోజుల్లో వస్తామని వెళ్లారు రావు, కొడుకు.

అస్థిమితంగా ఉంది రామ్మూర్తికి. భార్యతో సంప్రదించినా విషయం ఎటూ తేలటంలేదు. రాధతో మాట్లాడాడు. అమ్మాయికి అభ్యంతరం లేదు. ఇష్టంగానే ఉంది. ఎంత ఆలోచించినా మనసులో ఏవో తొలగిపోని తెరలు... భయాలు... పూర్తి స్వతంత్రం ఉంది.

స్వతంత్రం, స్వేచ్ఛ అనగానే వర్మ జ్ఞాపకాలు తోసుకొస్తున్నాయి. చివరి దశలోని వర్మ అనారోగ్యం గుర్తొస్తోంది. ఆ శరీర హింస కళ్లముందు కదులుతోంది. ఏది మంచి? ఏది చెడు అన్న ప్రశ్నలు ఎదురు ప్రశ్నిస్తున్నాయి.

అంతా గజిబిజి!

నెమ్మదిగా, స్థిమితంగా ఆలోచించాలి.

రావూ, కొడుకూ తిరిగి వచ్చేరోజు దగ్గరపడుతోంది. స్థిమితపడుతూ ఆలోచిస్తున్నాడు రామ్మూర్తి.

×××

ఆ రాత్రి ఫ్లైట్‌కే రమేష్, రావుల ప్రయాణం. పెళ్లి విషయం "అవును" అని అనుకోకపోయినా, "కాదు" అనే భావన లేని విచిత్ర స్థితి.

రామ్మూర్తికి ఇంకా సమయం కావాలేమో అనుకుని ఊరుకున్నాడు రావు.

ఎయిర్‌పోర్ట్‌కి బయలుదేరేముందు తను రాసిన ఉత్తరాన్ని మరోసారి జాగ్రత్తగా చదువుకున్నాడు రామ్మూర్తి.

"రావూ! వర్మ పోవటంతో నాలో స్థిరమైన ఆలోచన పోయిందిరా! రకరకాల భయాలు, గందరగోళాలు. నీతో చాలా చెప్పాలనుకున్నాను. అయినా చెప్పలేనివి ఉండిపోయాయి. మనిద్దరం వియ్యంకులమవటం కన్నా ఆనందం ఏముంటుంది చెప్పు!

"అయినా, ప్రాణ స్నేహితుడివైన నీతోనూ కొన్ని చెప్పలేకపోయాను. పెళ్లికి అయిష్టం అన్న ప్రసక్తే లేదు.వర్మ శారీరకంగా అంత హింస అనుభవించటం చూసిన నాలో ఆరోగ్యంమీద ఏదో తెలియనిభయం...అంతేకాదు, ఇంకాఏవో భయాలు...

"పిల్ల అక్కడ ఉండగలదా? ఆ సంస్కృతిలోదాని జీవితం ఏమిటి? ఇలా ఎటూ తేలని ఆలోచనలు... ఇలాగే నీ మనసులోనూ ఉండచ్చు. ఎటూ తేల్చుకోలేక నిర్ణయం నీకే వదిలేస్తున్నాను. రాధ నా కూతురు, రమేష్ నీ కొడుకనే కాదు... వాళ్లిద్దరూ మన పిల్లలు.

"అర్థం చేసుకుంటావనే నా నమ్మకం... ఈ ఉత్తరంతో ఉన్న కాగితం కూడా చూసి నాకు తెలియచెయ్యి. నీ ఇష్టమే నా ఇష్టం. నా సందేహాలని, పిచ్చి ఆలోచనలనీ నువ్వు భరించగలవనే ఇలా చేస్తున్నాను."

ఉత్తరాన్ని, దానికి పిన్ చేసిన కాగితాన్ని జాగ్రత్తగా మడిచి కవర్లో పెట్టి అంటించేశాక పెద్ద బరువు తీరినట్టయింది రామ్మూర్తి.

×××

వారం గడిచిందో, లేదో రావు దగ్గర్నుంచి ఎత్తరం వచ్చింది. చాలా ఆత్రుతగా తెరిచాడు రామ్మూర్తి. చేతులే కాదు, మనసే కాదు... సర్వేంద్రియాలు వణుకుతున్నంత కంగారు.

"రామ్మూర్తీ! ఓరి పిచ్చీ! ఎంత కంగారురా నీకు! నీ భయాల్లో, నీ సందేహాల్లో, నీ గజిబిజి ఊహల్లో... ప్రేమ తప్ప మరే స్వార్థం లేదురా! అది గమనించు.

"ఏమైతేనేం, చాలా మంచి పని చేశావు. నాకూ, నీకూ, మన పిల్లలకే కాదు... అందరికీ మంచి చేసే పని. ఉత్తరంలో నవ్వు జతచేసిన రిపోర్ట్ చూశాను... అమ్మాయి రాధ హెచ్ఐవి టెస్ట్. రాధ ఆరోగ్యం విషయంలో నాకేం సందేహమూ లేదు. అయినా మంచిదే. రాధ పూర్తి ఆరోగ్యవంతురాలని రిపోర్ట్ చెబుతోంది.

"రమేష్ టెస్ట్ రిపోర్ట్ కూడా పంపుతున్నాను. ఎందుకంటే వాడిది అమెరికా జీవితంలో రెండో తరం.

"నువ్వు ఉత్తరం ద్వారా కాకుండా స్వయంగా అడిగినా నాకు ఇంకా ఆనందంగా ఉండేది. ఇది తప్పు కాదు. ఒకరినొకరు అనుమానించుకోవటం కాదు. సందేహం లేని జీవితం... ధైర్యం నిండిన జీవితానికి ఒక మంచి పద్ధతి.

"నేనేమీ అనుకోలేదు. నువ్వూ అనుకోవాల్సిందేమీ లేదు. మనమే కాదు, మన పిల్లలు కూడా వారికి వారే జాగ్రత్తపడాల్సిన రోజులివి.మేరేజ్ ట్రెడిషన్ కాదు... హెల్తీ వే ఆఫ్ లైఫ్. ఇప్పుడు ఇలాంటి ఆరోగ్య జాగ్రత్తలే మోడరన్ జాతకాలు!

"ముహూర్తాలు పెట్టించి చెప్పు, నీదే ఆలస్యం!

నీ,

రావు

రావు ఉత్తరం మరోసారి చదువుకున్నాడు రామ్మూర్తి. ఆరోగ్యమైన గాలిలో, ఆహ్లాదపు ఛాయలో ఉన్నట్టు తేలిగ్గా ఉంది.

"జీవితంలో చేదు చాలా ఉంది. దానికన్నా ఎక్కువ అమృతం ఉంది. ఆ అమృతాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ఉంచుకోగలిగితేనే హాయైన జీవితం!" వర్మ మాటలు.

మళ్లీ వర్మే గుర్తొచ్చాడు రామ్మూర్తికి.

– ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కథల పోటీలో బహుమతి పొందిన కథ–4-11-2000